విద్యార్థులకు దుస్తుల పంపిణీ



దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న చైర్ పర్సన్ ప్రణీత

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చైర్ పర్సన్ ప్రణీత శ్రీకాంత్‌గౌడ్ శుక్రవారం దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కొత్త సురేఖ భాస్కర్‌రెడ్డి, నాయకులు మద్ది పాండుగౌడ్, శ్రీరాం, సాయి, లత, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎదులాబాద్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం



ఎదులాబాద్‌లో పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీలు సరళ, రవి

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లో పలు అభివృద్ధి పనులను ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీలు సరళకుమార్‌ముదిరాజ్, రవితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. గ్రామంలో 15వ ఆర్థిక సంఘం, మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలతో తాగునీటి పైపులైన్, అండర్ డ్రైనేజీ, సోలార్ లైట్లు ఏర్పాటు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ ధర్మారెడ్డి, ఏఈ వెంకట్‌రెడ్డి, నాయకులు శ్రీశైలం, కుమారస్వామి, యుగేందర్‌గౌడ్, సురేశ్, మల్లేశ్‌ముదిరాజ్, నరేందర్‌రెడ్డి, రాంచందర్, చందు, మురళి, వెంకటేశ్, చందు, మల్లేశ్, నాగరాజు, రాములు, స్థానికులు పాల్గొన్నారు.

రూ.9 లక్షలతో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న ఎంపీపీ మల్లారపు ఇందిర

కీసర: స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ నుంచి విడుదలైన రూ.9 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎంపీపీ మల్లారపు ఇందిరా లక్ష్మీనారాయణ అన్నారు. కీసర మండల పరిషత్‌లో ఎంపీపీ అధ్యక్షతన ప్రత్యేక సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల అభివృద్ధి కోసం అందుబాటులో ఉన్న నిధులను వినియోగిస్తామని చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ గ్యామ, జిల్లా పరిషత్తు ఉపాధ్యక్షుడు బెస్త వెంకటేశ్, వైస్ ఎంపీపీ సత్తిరెడ్డి, ఎంపీటీసీలు నారాయణ శర్మ, వెంకట్‌రెడ్డి, కిరణ్ జ్యోతి, ప్రమీల, వెంకటేశ్, కోఆప్షన్ సభ్యుడు బాషారత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి టౌన్‌షిప్ సమస్యల పరిష్కారానికి వినతి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పి.శ్రీనివాసరెడ్డికి టౌన్‌షిప్ అసోసియేషన్ అధ్యక్షుడు, కౌన్సిలర్ బి.హరిప్రసాదరావు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. షాపింగ్ కాంప్లెక్స్, కమ్యూనిటీ హాల్, హెల్త్ సెంటర్, క్లబ్ హౌస్ నిర్మాణాలు చేపట్టాలని, వసతుల కల్పన కోసం వదిలిన ఖాళీ జాగాలను అభివృద్ధి చేయాల్సిన అవసరతలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. టౌన్‌షిప్ ఏర్పడి 18 ఏళ్లు గడుస్తున్నా వసతుల కల్పనకు కాలనీవాసులు నోచుకోలేదని వాపోయారు. కమ్యూనిటీ సెంటర్ నిర్మాణం కోసం నిధులు కేటాయించినా ఇంకా పనులు జరగలేదన్నారు. ఇప్పటికైనా పైన పేర్కొన్న వసతులను ఏర్పాటు చేయడానికి హౌసింగ్ బోర్డు చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు.

హెచ్‌ఎంకు యువకుల స్వాగతం



పాఠశాల హెచ్‌ఎంను సత్కరిస్తున్న గ్రామ యువకులు

మేడ్చల్‌రూరల్: మండలంలోని రాజబొల్లారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా నియమితులైన ఆదిల్‌పాషకు శుక్రవారం గ్రామ యువకులు స్వాగతం పలికారు. పాఠశాలలో హెచ్‌ఎంను సన్మానించిన యువకులు పాఠశాలలోని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని కోరారు. పాఠశాలకు తమ సహకారం ఎల్లప్పుడు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో యువకులు సాయిబాబా, నాగార్జున, రాజ్‌బాబు, కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన ట్యాంక్ నిర్మిస్తాం



మినీ వాటర్‌ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ, మిషన్ భగీరథ ఏఈ రవళి

శామీర్‌పేట్: శామీర్‌పేటలోని మినీ ట్యాంక్‌ను శామీర్‌పేట ఎంపీపీ యెల్లుబాయి శుక్రవారం మిషన్ భగీరథ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రస్తుత మినీ ట్యాంక్ లీకేజీలతో కాలనీవాసులకు నీటి కొరత ఏర్పడుతోందని, దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఎంపీపీ, అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే ఈ ట్యాంక్‌ను కూల్చివేసి నూతన ట్యాంక్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏఈ రవళి, ఎంపీటీసీ సాయిబాబా, కాలనీ వాసులు పాల్గొన్నారు.

'మీ సేవ'.. మా ఇష్టం..



- ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అధికంగా వసూలు
- బినామీ పేర్లతో పలుచోట్ల దందా
- అన్ని ధ్రువపత్రాలకు మీ సేవ కేంద్రమే దిక్కు
- అధికారులు స్పందించాలంటున్న ప్రజలు

సాక్షి, మేడ్చల్: ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన మీ సేవ కేంద్రాల్లో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నగరంతో సహా శివారు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలోని పలు మీ సేవ కేంద్రాల్లో ధ్రువ పత్రాల కోసం డబ్బులు అధికంగా వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రుసుం కంటే అధిక వసూళ్లు చేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. మీ సేవ కేంద్రాలను పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు నిర్వాహకులతో కుమ్మక్కవుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ధ్రువపత్రాల కోసం మీరు ఏ కార్యాలయానికి తిరగాల్సిన అవసరం లేదని, తమకు అడిగినంత ఇస్తే.. వాటిని తెచ్చిస్తామని మీ సేవ కేంద్రం నిర్వాహకులు ప్రజల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.

పలుచోట్ల దందా..

జనన, మరణ ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేస్తే రూ.90 తీసుకోవాలి. కానీ కేంద్రాల నిర్వాహకులు రూ.120 నుంచి రూ.150 వరకు వసూలు చేస్తున్నారు. కులం, ఆదాయం, నివాస ధ్రువపత్రాలకు దరఖాస్తు కోసం రూ.45 తీసుకోవాల్సి ఉండగా, రూ.70 నుంచి రూ.100 వరకు తీసుకుంటున్నారు. శివారుల్లోని పలుచోట్ల రూ.60 వరకు వసూలు చేస్తున్నారు. చాలా వరకు మీ సేవ కేంద్రాల్లో ఇదే దందా కొనసాగుతోంది.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా..

ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించడంతో పాటు యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మీ సేవ కేంద్రాలను ఏర్పాటు చేసింది. నగరంతో సహా శివారు రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 1,327 మీ సేవ కేంద్రాలు ఉండగా, ఇందులో ఒక్క మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోనే 306 మీ సేవ కేంద్రాలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రభుత్వం ఏ పథకం చేపట్టినా మీ సేవ కేంద్రాల ద్వారానే దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తోంది. ప్రజల అవసరాలను ఆసరా చేసుకొని చాలాచోట్ల అధిక రుసుం వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిపై 'తహసీల్దారు కనీస పర్యవేక్షణ చేయడం లేదు. ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ఉన్నత చదువుల కోసం విద్యార్థులు కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. ఇదే అదనుగా భావించిన నిర్వాహకులు అక్రమాలకు పాల్పడుతున్నారు. ఏ సేవలకు ఎంత రుసుం చెల్లించాలో తెలియజేసే బోర్డులు పెట్టాల్సి ఉన్నా, కొందరు నిర్వాహకులు ఏర్పాటు చేయడం లేదు. మరి కొన్ని మీ సేవ కేంద్రాల్లో సిటిజన్ చార్ట్ ఉన్నా.. వాటిని నిర్వాహకులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. మీ సేవ కేంద్రాలకు ధ్రువ పత్రాల కోసం వచ్చే వారి సంఖ్య అధికంగా ఉండటంతో ప్రభుత్వం నిర్ణయించిన రుసుం మాత్రమే చెల్లిస్తామని నిర్వాహకులతో లబ్ధిదారులు చెప్పలేకపోతున్నట్లు వాపోతున్నారు.

బినామీ పేర్లతో నిర్వహణ..

నగరంతో సహా శివారుల్లో పలుచోట్ల మీ సేవ కేంద్రాలను ఒకరి పేరుతో అనుమతి పొంది, మరొకరు నిర్వహిస్తున్నారు. నిబంధనల మేరకు ఎవరి పేరుతో మంజూరు ఉంటుందో వారే కేంద్రాలను కొనసాగించాలి. కానీ పైరవీలు చేసుకొని కేంద్రం మంజూరు చేయించుకున్న వారు ఇతర పనులు చూసుకుంటూ వీటిని ఇతరులకు ఇస్తున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి నిర్వహణపై పర్యావేక్షణ పెంచాల్సిన అవసరం ఉంది.

రూ.40 అదనంగా తీసుకున్నారు..

నేను ఇటీవల డిగ్రీ పూర్తి చేశాను. పైచదువుల కోసమని ఆదాయ ధ్రువపత్రం కోసం మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నాను. నా దగ్గర రూ.90 వసూలు చేశారు. రూ.50 అని అడిగితే మేము చేయం వెళ్లమన్నారు. గత్యంతరం లేక ఎక్కువ డబ్బులిచ్చి దరఖాస్తు చేసుకున్నాను.

- వై.ప్రేమ్‌సాగర్, రామంతాపూర్, ఉప్పల్ మండలం

టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయండి..

ప్రతి మీ సేవ కేంద్రంలో సిటిజన్ చార్ట్ తప్పనిసరిగా ఉండాలి. అందులో సూచించిన మేరకే నగదు తీసుకోవాలి. అధిక వసూళ్లకు పాల్పడితే 1100 టోల్ ఫ్రీ నంబర్, లేదా స్థానిక తహసీల్దార్, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. చర్యలు తీసుకుంటాం. ఎవరి పేరుపై ఉంటే వారే నిర్వహించుకోవాలి.

- భానుప్రకాష్, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

ప్రతి వ్యక్తి సమాజానికి సహాయపడాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర: ప్రతి వ్యక్తి సమాజానికి తమవంతు సహాయపడాలని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బండ్లగూడలోని బిలీవర్స్ ఈస్టర్న్ చర్చి హైదరాబాద్ డయాసీస్‌లో శుక్రవారం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల చర్చి అధినాయకుల సేవలను ప్రశంసించారు. ప్రతి ఒక్కరూ సమాజానికి సేవ చేయాలని అన్నారు. క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, దమ్మాయిగూడ మున్సిపల్ చైర్ పర్సన్ ప్రణీత శ్రీకాంత్ గౌడ్, కౌన్సిలర్ సురేఖ భాస్కర్, ఎన్‌సీసీ, టీసీసీ కౌన్సిల్ క్రైస్తవ నాయకులు తదితరులు ఉన్నారు.

హామీలను తక్షణమే అమలు చేయాలి



మాట్లాడుతున్న బాలమల్లేష్

బోడుప్పల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్ అన్నారు. బోడుప్పల్ బొమ్మక్ శంకరయ్య గార్డెన్‌లో శుక్రవారం ఎం.మహేశ్వరి అధ్యక్షతన జరిగిన మేడిపల్లి మండల సీపీఐ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మేడిపల్లి మండలంలోని సర్వే నంబర్-48 భగత్‌సింగ్‌నగర్‌లో పేదల ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని, మహిళలకు, వృద్ధులకు పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. మేడిపల్లి మండల పరిధిలో ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి డి.జి.సాయిల్, మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్, జె.లక్ష్మి, కె.ప్రమీల, సీహెచ్ మాధవి, దండు రమేష్ పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహజ్యోతి అందించాలి

ఉప్పల్: ఉప్పల్‌లో విద్యుత్ సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం హబ్సిగూడ డీఈ సూర్యనారాయణతో ఉప్పల్ పద్మావతి కాలనీ తదితర కాలనీల అసోసియేషన్లతో కలిసి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. విద్యుత్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని, గృహజ్యోతి పథకం అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన డీఈ ఉచిత విద్యుత్ అందిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో పాశికంటి నాగరాజ్, పద్మావతి కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, విజయకుమార్, సల్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తి రిమాండ్

మేడ్చల్‌రూరల్: మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై మేడ్చల్ పోలీసులు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని శ్రీరంగవరం గ్రామంలో 11 ఏళ్ల బాలిక గురువారం సాయంత్రం ఆడుకునేందుకు పక్క ఇంటికి వెళ్లింది. ఇదే అదనుగా భావించిన హన్మంతు(40) ఏళ్ల వయస్సు గల నిందితుడు ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి బాలికతో అసభ్యంగా ప్రవరించాడు. దీంతో బాలిక కేకలు వేస్తూ బయటకు పరుగులు తీసింది. కుటుంబ సభ్యులకు విషయం చెప్పడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. మేడ్చల్ పోలీసులు బాలిక తెలిపిన వివరాలను రికార్డు చేసుకుని ఆధారాలు సేకరించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

బాలుడి అదృశ్యం



అనురాగ్(ఫైల్)

మేడ్చల్‌రూరల్: చిన్నారుల కేంద్రం నుంచి బాలుడు అదృశ్యమైన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ పట్టణంలోని ఉమానగర్‌లో ఉన్న మ్యాంగో వికాస్ కేంద్రంలో ఈ నెల 13న నగరంలోని సైదాబాద్‌లోని ప్రభుత్వ బాలుర చిల్డ్రన్ హోమ్‌కు చెందిన మతిస్థిమితం సరిగ్గా లేని అబ్బాయి అయిన అనురాగ్(12)ను ఆశ్రమ సూపరింటెండెంట్ చేర్పించాడు. కాగా మ్యాంగో వికాస్ కేంద్రంలో ఒక్కరోజు ఉన్న అనురాగ్ మరుసటి రోజైన శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా కేంద్రం నుంచి బయటకు వెళ్లిపోయాడు. నిర్వాహకులు చుట్టుపక్కలా వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో మేడ్చల్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి



ఘట్‌కేసర్‌లో రక్తదానం చేస్తున్న రాజ్‌కుమార్‌ముదిరాజ్, వీరబాబు

ఘట్‌కేసర్: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని ఘట్‌కేసర్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరం ఇన్‌చార్జి మహేందర్ మాట్లాడుతూ క్షతగాత్రుల ప్రాణాలు కాపాడేందుకు ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని అన్నారు. రక్తదానం ఇతరుల ప్రాణాలు కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో మన్నెం రాజ్‌కుమార్‌ముదిరాజ్, వీరబాబు, వెంకన్న తదతరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన విద్యార్థులు



మేడ్చల్‌రూరల్: ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ ఆస్పత్రిలో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో సీఎంఆర్ విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి డీన్ వెంకటరమణ, సూపరింటెండెంట్ మురళీధర్‌రెడ్డి, డైరెక్టర్ అలీ బేగ్, పీఆర్వో దుర్గాప్రసాద్‌రెడ్డి, డాక్టర్ ప్రియదర్శి, కళాశాల రాజిరెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓ, విద్యార్థులు పాల్గొన్నారు.

జరిమానా లేకుండా పన్నులు చెల్లించండి

కీసర: ఇంటి పన్నులు సకాలంలో చెల్లిస్తే 2 శాతం జరిమానా భారం ప్రజలపై పడదని నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేంద్ర కుమార్ తెలిపారు. ఈనెల 30వ తేదీలోపు సగం ట్యాక్స్, డిసెంబర్ 31లోపు మిగిలిన ట్యాక్స్ చెల్లిస్తే 2 శాతం పెనాల్టీ ఉండదని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు ఇంటింటికీ వచ్చి డిమాండ్ నోటీసులు ఇస్తున్నారన్నారు.

ఈఎంఆర్‌ఐటో ఉద్యోగావకాశాలు

మేడ్చల్: గుండ్లపోచంపల్లిలోని ఈఎంఆర్ఐ కేంద్రంలో పలు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సంస్థ ప్రోగ్రాం మేనేజర్ షేక్ జాన్ షాహిద్ తెలిపారు. ఈఎంఆర్ఐ ఆధ్వర్యంలో నడిచే పశుసంచార వైద్యశాల, అంబులెన్స్ పైలెట్, డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. పదో తరగతి పాసై, 23 నుంచి 30సంవత్సరాల వయస్సులోపు ఉన్న వారు కార్యాలయంలో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

ధరణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఘట్‌కేసర్, మూడు చింతలపల్లి, గండి మైసమ్మ, కీసర, శామీర్‌పేట, మేడ్చల్ మండలంలోని ధరణి మాడ్యూల్స్‌లో పెండింగ్ ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం నగరంలోని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్‌తో ఆయన మట్లాడారు.

- సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ ధరణి మాడ్యూల్స్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను ప్రాధాన్యత పరంగా అన్ని స్థాయిల్లో పూర్తిగా పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. కార్యాలయ స్థాయిలో పరిశీలన చేసి వాటిని క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలన్నారు.

జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా రాజు

- ఉపాధ్యక్షుడితో సహా మరో 10 మంది సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం
- ఎన్నికల అధికారి నాగలింగాచారి, మత్స్యశాఖ అధికారి పూర్ణిమ

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా మన్నె రాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, డీసీఓ నాగలింగాచారి, జిల్లా మత్స్యశాఖ అధికారి బి.పూర్ణిమ సంయుక్త ప్రకటనలో తెలిపారు. సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా కాపర్తి మోహన్‌కృష్ణ, మేనేజింగ్ కమిటీ మెంబర్లుగా జి.సంతోష్, సీహెచ్.సత్యవతి, పి.లక్ష్మణ్, పి.దేవేందర్, ఎం.వెంకటేష్, కె.రాము, యూ.వేణుగోపాల్, టి.హనుమంతు, పీఎస్.అనురాధ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు. జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల నిర్వహణకు ఈ నెల 10న ఎన్నికల అధికారి నాగలింగాచారి, మత్స్యశాఖ జిల్లా అధికారి పూర్ణిమ నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెల్సిందే. ఈ ఎన్నికలకు సంబంధించి 13వ తేదీన నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, తుదిజాబితా ప్రకటన ఉండగా, అన్నీ పోస్టులకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలైంది. పోటీలో సభ్యులు ఎవరూ లేక పోవడంతో శుక్రవారం(14వ తేదీన) జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం కమిటీ ఏకగ్రీవంగాఎన్నికైనట్లు వారు ప్రకటించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చూపాలి



సమావేశంలో డబీల్‌పూర్ నాయకులు, కార్యకర్తలు

మేడ్చల్: మేడ్చల్ మండలంలో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సత్తా చూపాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డబీల్‌పూర్ మాజీ సర్పంచ్ దుడ్డు సంజీవరావు అన్నారు. ఎల్లంపేట్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన డబీల్‌పూర్ గ్రామ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో ప్రధానంగా బీఆర్ఎస్ ప్రధాన నాయకులు ఉన్న డబీల్‌పూర్ లాంటి గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు శ్రమించి పార్టీకి మెజార్టీ తెచ్చారని అన్నారు. కార్యకర్తలు అదే స్ఫూర్తితో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పనిచేసి పార్టీ బలపరిచే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో డబీల్‌పూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కృత్రిమ పాల విక్రేతపై కేసు నమోదు

పోచారం: కృత్రిమ పాలు విక్రయిస్తున్న వ్యక్తిపై పోచారం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌదరిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని మక్తకు చెందిన కొట్టా సత్తిబాబు(32) మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ సమీపంలో పాలపొడితో కృత్రిమ పాలు తయారు చేసి విక్రయిస్తున్నాడు. తన షెడ్డులోని బర్రెలకు ఇంజెక్షన్లు ఇచ్చి పాలు పితుకుతున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు తనిఖీ చేసి షేప్ ఇంజెక్షన్లు, పాలపొడిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య



పోచారం: ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలోని యంనంపేట్ వద్ద గుర్తు తెలియని యువకుడు (దాదాపు 30) శుక్రవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. రెండు కాళ్లు పూర్తిగా తెగి పోయాయి. తల, నుదుటి భాగంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే సికింద్రాబాద్ రైల్వే పోలీసులను సంప్రదించాలని అధికారులు కోరారు.

10 బస్సులపై కేసులు నమోదు



మేడ్చల్: నిత్యం విద్యార్థులను స్కూళ్లకు తీసుకెళ్లే స్కూల్, కాలేజీల బస్సులను ఆర్టీఏ అధికారులు మేడ్చల్‌లో జాతీయ రహదారిపై శుక్రవారం తనిఖీలు చేశారు. బస్సుల ఫిట్‌నెస్, సరైన ధ్రువపత్రాలు ఉన్నాయా లేదా, రూల్స్ పాటిస్తున్నారా లేదా? అనే అంశాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని 10 బస్సులపై ఆర్టీఏ అధికారులు కేసులు నమోదు చేశారు. డ్రైవ్‌లో ఎంవీఐ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖాతాదారులు హాజరు కావాలి

గౌతంనగర్: వెస్ట్ మల్కాజిగిరి బ్రాంచ్ హనుమాన్‌పేట్‌కు చెందిన ది కో-ఆపరేటివ్ సొసైటీ ఖాతాదారుల సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు హనుమాన్‌పేట్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించనున్నట్లు సొసైటీ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఖాతాదారులు హాజరు కావాలని కోరారు.

భక్తుల కోర్కెలు తీర్చే నిమిషాంబదేవి



నిమిషాంబదేవిని దర్శించుకున్న నాగూర్‌బాబు

బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని నిమిషాంబదేవి ఆలయాన్ని ప్రముఖ నేపథ్య గాయకుడు, నటుడు, నిర్మాత నాగూర్ బాబు, జబర్దస్త్ కామెడీ షో టీం లీడర్ రాకింగ్ రాకేష్ శుక్రవారం సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగూర్‌బాబు మాట్లాడుతూ నిమిషాంబ దేవి భక్తుల కోర్కెలు తీర్చే అమ్మవారిగా పేరొందారన్నారు. అమ్మవారిని దర్శించుకుంటే కష్టాలు తొలగిపోయి అన్నీ శుభాలే కలుగుతాయన్నారు. ఆలయ ప్రతినిధులు వినోద్‌కుమార్, గౌరిశంకర్, అశోక్‌కుమార్, శ్రీనివాస్, రమేష్, ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడిపై పెప్పర్ స్ప్రే చల్లి దోపిడీకి విఫలయత్నం

ఉప్పల్: ఇళ్లల్లోకి చొరబడి వృద్ధులపై పెప్పర్ స్ప్రే చేసి దోపిడీకి యత్నించిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన మేరకు.. చిలుకానగర్ శివాలయం వద్ద నివాసముంటున్న పిట్టల సుదర్శన్ (66) ఉంటున్న ఇంటి మొదటి అంతస్తులో పోర్షన్‌కు టు లెట్ బోర్డు ఉంది. మధ్యప్రదేశ్‌కు చెందిన హిమాన్షి(23), ఆమె సోదరుడు గాంధీ రామ్ కస్తూరి(21) బోర్డను గమనించారు. వీరు చిలుకానగర్‌లోనే ఉంటున్నారు. గురువారం రాత్రి 11 గంటల ప్రాంతంలో సుదర్శన్ ఇంటికి వెళ్లి అద్దెకు అడిగారు. తెలిసిన వారికి మాత్రమే ఇస్తామని చెప్పిన సుదర్శన్ పైపోర్షన్ ఇంటికి తాళం వేయడానికి వెళ్లాడు. అతడి వెనకే వెళ్లిన నిందితులు సుదర్శన్‌పై పిడిగుద్దులతో దాడికి తెగబడ్డారు. నోట్లో గుడ్డలు కుక్కి పేపర్ స్ప్రే చల్లారు. పసిగట్టిన స్థానికులు నిందితులకు దేహశుద్ధి చేసి గదిలో బంధించి పోలీసులకు అప్పగించారు. నిందితులపై కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మన్మథరావు తెలిపారు.